జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 6 | మే | 2025 ◆ పేజీలు : 3



# ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం



**ఇల్లందు, మే 5, ప్రజాజ్యోతి :** ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లందు ఆర్టీసీ డిపోలో నూతన 2 బస్సు సర్వీసులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక బస్సు కొత్తగూడెం, పాల్వంచ మీదుగా మణుగూరు, మరోక బస్సు కొత్తగూడెం మీదుగా సత్తుపల్లి వరకు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్సులో కొంత దూరం ప్రయాణించారు. ఎమ్మెల్యేను ఆర్టీసీ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిపో మేనేజర్, డిపో కంట్రోలర్, ఆర్టీసీ సిబ్బంది, పట్టణ కాంగ్రెస్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, మండల, యువజన, ఐఎన్టియుసి, యువజన విభాగం, మహిళా కమిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎక్కడమ్మా నువ్వు లేనిది... ఏమిటి నువ్వు సాధించలేనిది

2 లో..

- మహిళా సాధికారత సాధనే ఆమె లక్ష్యం..
- పల్లెల్లో విస్తరింప చేస్తున్న కొల్లి ఫౌండేషన్ సేవలు
- బాపుజీ కలలను నిజం చేస్తున్న కల్పనా చౌదరి

కొత్తగూడెం పట్టణానికి అడవిలో సుదూర ప్రాంతంలో ఉన్న గ్రామీణ మహిళలు వారి సంపూర్ణ ఆర్థిక పరిపుష్టితను సాధించుకోవాలని ఆ ఇంట్లో ఆర్థికంగా ఎదిగి చేదోడు వాదోడుగా ఉండాలని మహిళలు అంటేనే వంటింటి కుందేళ్లు అనే నినాదం మారాలని ఆమె ఉద్యమంలా చేపట్టిన ధృడ సంకల్పం ఎన్నో విజయాలను సమకూరుస్తుంది. గ్రామీణ ప్రాంతంలో జీవిస్తున్న మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని , పల్లెలు ఆర్థికంగానే ఎదుగితేనే దేశ సౌభాగ్యం సాధించినట్లేనని , బాపూజి కలలు కన్న నవ సమాజం కోసం ఆమె స్వయంగా ఏర్పరుచుకున్న కొల్లి ఫౌండేషన్ సేవలన్ని పల్లె ప్రాంతాలలో విస్తరింప చేస్తూ ఎందరో ప్రముఖుల మన్ననలు పొందిన కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరిపై ప్రజాజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.



◆ లక్ష్మీదేవిపల్లి, ప్రజాజ్యోతి



# నిషేధిత గంజాయి పట్టివేత

- ఇరువురు అరెస్ట్ - ముగ్గురు పరారి
- 111.574 కిలోల గంజాయి విలువ రూ.55,87,700

**ఇల్లందు, మే 5, ప్రజాజ్యోతి:** ప్రభుత్వ నిషేధిత గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని 111.574 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇల్లందు డిఎస్పి ఎన్. చంద్రభాను తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి వివరాలను వెల్లడించారు. ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణ, సిసిఎస్ సీఐ రమాకాంత్ లకు పక్కా సమాచారం మేరకు బొజ్జయిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ఇల్లందు ఎస్ఐ పి. శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా కొత్తగూడెం నుంచి ఇల్లందుకు వస్తున్న ఆటో, పల్సర్ ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. వారిని విచారించగా జహీరాబాద్ కు చెందిన రాజు కుమార్ రాథోడ్ ఆదేశాల మేరకు ఒడిశాకు చెందిన కవటం అలియాస్ ధారా అలియాస్ సందీప్ కుమార్ అలియాస్ రమేష్, సంజు సాయి

మిగతా 2 లో...

# మావోయిస్టు పేరుతో వసూళ్లు

- ఇద్దరి అరెస్ట్... ఐదు వేలు స్వాధీనం..
- డి.ఎస్.పి చంద్రభాను



**గుండాల, మే 5, ప్రజాజ్యోతి :** మావోయిస్టు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరినీ అరెస్టు చేసి నట్టు ఇల్లందు డిఎస్పి చంద్రబాబు తెలిపారు. సోమవారం గుండాల పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుండాల ఎస్సై రాగూఫ్ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ కు వెళ్తుండగా తూరుబాక గ్రామం వద్ద రోడ్డుపై ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా తారాస పడడంతో

మిగతా 2 లో...

# పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన భద్రాద్రి జిల్లా క్రీడాకారులు

**భద్రాచలం టౌన్, మే 5, ప్రజాజ్యోతి :** హైదరాబాదులోని మేడ్చల్ లో మే 3, 4 వ తేదీలలో జరిగిన స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఎక్విప్పడ్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రెండు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జీవి రాంరెడ్డి తెలిపారు. భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ లో పవర్ లిఫ్టింగ్ ప్రాక్టీస్ చేసిన డివి శంకర్రావు మాస్టర్ 4 విభాగంలో 83 కేజీల కేటగిరీలో, స్క్వాట్ – 60 కేజీలు, బెంచ్ ప్రెస్ – 55 కేజీలు డెడ్ లిఫ్ట్ – 100 కేజీలు, మొత్తం గా

మిగతా 2 లో...



## నిషేధిత గంజాయి పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

అలియాస్ ప్రదేశ్ బిస్వాల్ వద్ద నుంచి జహీరాబాద్ కు తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టుబడిన 111.754 కిలోల గంజాయి విలువ సుమారుగా రూ. 55,87,700 ఉంటుందన్నారు. ఇరువురిని అదుపులోకి తీసుకోని రిమాండ్ కు తరలించామని, మరో ముగ్గురు పరారిలో ఉన్నట్టు తెలిపారు. అదేవిధంగా ఆటో, ద్విచక్ర వాహనం, 3 సెల్ ఫోన్లు, జియో నెట్వర్క్ రూటర్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ప్రభుత్వ నిషేధిత గంజాయి అమ్మకాలు, రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గంజాయిని పట్టుకున్న ఇల్లందు సీఐ, సిసిఎస్ సీఐ, ఇల్లందు ఎస్ఐ లను డిఎస్పి అభినందించారు. ఈ సమావేశంలో ఇల్లందు సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ పి. శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించిన భద్రాద్రి జిల్లా క్రీడాకారులు

(మొదటి పేజీ తరువాయి...)

215 కేజీల బరువెత్తి బంగారు పతకాన్ని సాధించారు. మాస్టర్ 2 కేటగిరీలో 74 కేజీల విభాగం లో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కోశాధికారి మహంతి వెంకటకృష్ణాజీ రజత పతకాన్ని సాధించారు. మణుగూరుకు చెందిన పి. పాండురాజు 53 కేజీల జూనియర్ విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. డీవీ శంకర్రావు జిల్లాకు బంగారు పతకం సాధించటం పట్ల జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డివి శంకర్రావు మాట్లాడుతూ తన కోచ్ జీవి రామిరెడ్డి కఠోర శిక్షణ వల్ల అసోసియేషన్ సభ్యులైన డాక్టర్ శివ రామకృష్ణ ప్రసాద్, మహంతి వెంకటకృష్ణాజి, గుగులోతు శోభ నాయక్ ల ప్రోత్సాహం తో ఈ విజయం సాధించినట్లు తెలిపారు. ఈ గెలుపొందిన క్రీడాకారులని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. మల్లేష్, తాండ్ర వెంకటరమణరావు పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, పట్టణ ప్రముఖులు రాజకీయ నాయకులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు అభినందించారు.

## నూతన సీఐను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



**భద్రాచలం టౌన్, మే 5 (ప్రజాజ్యోతి ):** భద్రాచలం నూతన ఎస్సైగా నాగరాజు పదవీ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. సోమవారం సీఐ నాగరాజును బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ నాగరాజును కలిసిన వారిలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, మండల నాయకులు, యువజన విద్యార్థి విభాగం, సోషల్ మీడియా నాయకులు పలువురు ఉన్నారు.

## అక్రమ గృహనిర్మాణాన్ని నిలుపుదల చేయాలి : ఆదివాసీ ఉద్యోగుల సంఘం



**భద్రాచలం టౌన్,మే 5(ప్రజాజ్యోతి ):** ఆదివాసీ ఉద్యోగుల సంఘం రాజుపేట కాలనీశాఖ ఆధ్వర్యంలో గృహనిర్మాణ సొసైటీ ద్వారా కొనుగోలు చేసిన స్థలంలో గిరిజనేతరుడైన కిలారి అశోక్ సొసైటీ నిబంధనలకు విరుద్దంగా, 1/70కి విరుద్ధంగా గృహనిర్మాణాన్ని చేపట్టడాన్ని నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావులకు సోమవారం సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందిస్తూ ఆదివాసీ ఉద్యోగుల సొసైటీకి సంబంధించి ప్లాట్లు గిరిజనేతరులు గృహాలు నిర్మించడం అనేది చట్టానికి విరుద్ధమని వెంటనే ఆ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని పంచాయతీ ఈవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీఏ రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు, పూనం కృష్ణ, సోడి రాంబాబు, వసంతరావు, చలపతి, నారాయణ, బాపనయ్య, దుర్గ, వెంకటేశ్వర్లు, చిన్నయ్య, కాంతారావు, సురేష్, వీరేందర్, భీమరాజు, రామచిట్టి, కుంజా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎక్కడమ్మా నువ్వు లేనిది..
# ఏమిటి నువ్వు సాధించలేనిది...

**లక్ష్మీదేవిపల్లి, మే 5, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం పట్టణానికి అడవిలో సుదూర ప్రాంతంలో ఉన్న గ్రామీణ మహిళలు వారి సంపూర్ణ ఆర్థిక పరిపుష్టితను సాధించుకోవాలని ఆ ఇంట్లో ఆర్థికంగా ఎదిగి చేదోడు వాదోడుగా ఉండాలని మహిళలు అంటేనే వంటింటి కుందేళ్లు అనే నినాదం మారాలని ఆమె ఉద్యమంలా చేపట్టిన ధృడ సంకల్పం ఎన్నో విజయాలను సమకూరుస్తుంది. గ్రామీణ ప్రాంతంలో జీవిస్తున్న మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలని, ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని , పల్లెలు ఆర్థికంగానే ఎదుగితేనే దేశ సౌభాగ్యం సాధించినట్లేనని , బాపూజి కలలు కన్న నవ సమాజం కోసం ఆమె స్వయంగా ఏర్పరుచుకున్న కొల్లి ఫౌండేషన్ సేవలన్ని పల్లె ప్రాంతాలలో విస్తరింప చేస్తూ పల్లెల్లో నివసిస్తున్న విద్యార్థులు, యువతి , యువకుల్లో దాగిన సృజనాత్మకతను వెలికితీసి స్వయం సమృద్ధిని సాధించేందుకు ఆమె అకుంఠితగా చేస్తున్న అక్షర ఉద్యమం మహిళల సాధికారత సాధించే క్రమంలో ఆమె ఒక అడుగు ముందుకు వేసిందని చెప్పవచ్చు. నిత్యం కొల్లి ఫౌండేషన్ సేవలు అన్ని రంగాల్లో విస్తరింప చేసి గ్రామాల్లో యువకులను ప్రోత్సహిస్తూ విద్యా , ఆరోగ్య ఉపాధి రంగాలలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఎందరో ప్రముఖుల మన్ననలు పొందిన కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరిపై ప్రజాజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

### రూ. 5 లక్షలతో అత్యాధునిక కుట్టుమిషన్ల శిక్షణా కేంద్రం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , లక్ష్మీదేవిపల్లి మండలంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన రేగళ్ల పంచాయతీలో ప్రతిభ దాగి ఉన్న మహిళలను గుర్తించి వారిలో ప్రతిభ పాటవాలను పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం అనుమతితో మినిస్టరీ ఆఫ్ టెక్స్ టైల్స్ సహకారంతో రూ. 5 లక్షల వ్యయంతో అత్యాధునిక ఉచిత కుట్టుమిషన్ల శిక్షణా కేంద్రాన్ని స్థాపించారు. జనవరి 2025న స్థాపించిన ఈ శిక్షణ కేంద్రానికి రేగళ్ల పరిసర ప్రాంతాలలో గిరిజన మహిళలు అధునాతన మిషన్ల ద్వారా కంప్యూటర్, టైలరింగ్ లపై ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సుమారు 60 మంది సభ్యుల చేత నిర్వహిస్తున్నారు. మహిళలకు ఉచితంగా శిక్షణను అందిస్తూ శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు కూడా అందజేయడం విశేషం.

### సంపూర్ణ ఆరోగ్యం కోసం ఫౌండేషన్ సేవలు

గ్రామీణ ప్రాంతాల్లో దట్టమైన దండకారణ్యంలో నివసిస్తున్న గిరిజనులు, గిరిజనేతరులు అనారోగ్యం పాలు కాకుండా సంపూర్ణ ఆరోగ్యం కోసం కొల్లి ఫౌండేషన్ ద్వారా వేలాది రూపాయలను వెచ్చించి, మైలారం గిరిజన ప్రాంతంలో ఉచితంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వందలాది మంది గిరిజనులకు కార్పోరేట్ స్థాయిలో వైద్యాన్ని అందించారు.

### అందరూ చదవాలి... అందరు ఎదగాలి... ఫౌండేషన్ లక్ష్యం

ప్రతీ ఒక్కరూ చదువుకుంటూనే కుటుంబాలు ఆర్థికంగా ఎదుగుతాయనే సంకల్పంతో గిరిజన ప్రాంతాల్లో చదువుకునే స్థోమత లేక ఉన్న ప్రజలను చేరదీసి వారి వారి పిల్లలకు విద్యా బోధనను అందించేందుకు కొల్లి ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్పనా చౌదరి ప్రత్యేక దృష్టి సాధించారు. రేగళ్ల మైలారం తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ తన ఫౌండేషన్ ద్వారా చిన్నపాటి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు అవసరమయ్యే పెన్నులు, బ్యాగులు , పుస్తకాలు ఉచితంగా అందించారు. గ్రామీణ ప్రాంతంలో అన్ని రంగాల్లో ప్రజలు ఆర్థికంగా ఎదిగేందుకు ఫౌండేషన్ అందిస్తున్న సేవలపై పలువురు అభిప్రాయం ఇలా...

### తొలి ప్రయత్నం ఒక్కరితో ఆగిపోవద్దూ...

**కొల్లి కల్పనా చౌదరి ( ఫౌండేషన్ అధ్యక్షురాలు )**



గ్రామాలలో ప్రజల జీవన విధానంపై గత కొన్నేళ్లుగా ఎన్నో ప్రయత్నాలు చేశారని చివరికి కొల్లి ఫౌండేషన్ ను స్థాపించి సమాజ సేవలో నేను సైతం అనే విధంగా భాగస్వామ్యం అవుతున్నారని, గ్రామాలలో మహిళలు పట్టణ స్థాయిలో పురుషుల కంటే ఎంతో తెలివిగా ఉంటారని ఆ తెలివిని వృదా కానివ్వకుండా సరైన మార్గంలో పయనించేందుకు ఉచిత కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రాన్ని స్థాపించారని రేగళ్ల ప్రాంతంలో టెక్స్ టైల్స్ హబ్ గా మార్చడమే తన ధ్యేయమన్నారు.

### ఫౌండేషన్ సంకల్పానికి సంపూర్ణ సహకారం

**గుగులోత్ రూప్లా నాయక్ ( శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ )**



గ్రామాలలో ఉన్న ప్రజల కోసం ఫౌండేషన్ అందిస్తున్న సేవలకు తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తున్నానని కల్పనా చౌదరి ఆలోచనలకు తాను సైతం అడుగు ముందుకు వేస్తున్నానని శిక్షణ కో ఆర్డినేటర్ గుగులోత్ రూప్లా నాయక్ తెలిపారు.

### ఎంతో మనోధైర్యాన్ని ఇచ్చింది..

**కె. కవిత ( గ్రామస్తురాలు)**



రేగళ్ల ప్రాంతంలో ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమిషన్ల శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ప్రస్తుతం ఖరీదైన జాకెట్లు , పంజాభి డ్రస్సులు, కంప్యూటర్ స్థాయిలో మంచి, మంచి డిజైన్లతో కుడుతున్నాను. నా కుటుంబానికి నేను అందిస్తున్న సేవలకు నాలో ఎంతో మనో ధైర్యాన్ని ఫౌండేషన్ కల్పించింది.

## మావోయిస్టు పేరుతో వసూళ్లు

(మొదటి పేజీ తరువాయి...)

వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వీరు అళ్లపల్లి మండలం నడిమిగూడెం గ్రామానికి చెందిన పాయం రాజేందర్ 28, గుండాల మండలం గణపురం గ్రామానికి చెందిన కల్తి పాపయ్య 45 లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిద్దరూ గతంలో ప్రజా ప్రతిఘటన అజ్ఞాత దళాలలో పనిచేసే లొంగిపోయారని, జల్సాలకు అలవాటు పడి గత రెండు నెలలుగా గుండాల ఆళ్లపల్లి వ్యాపారస్తులను మావోయిస్టు పార్టీపేరుతో బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని విచారణలో వెల్లడైందని తెలిపారు. వీరి వద్ద నుండి 5000 రూపాయలు ఒక మొబైల్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరిని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో గుండాల సీఐ రవీందర్, ఎస్సై రాగూఫ్ పాల్గొన్నారు .

## సరైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇల్లు

- **ఇందిరమ్మ ఇల్లు ఎలాంటి అవకతవకులు జరగలేదు**
- **ఇందిరమ్మ కమిటీ సభ్యులు**



**ఆళ్ళపల్లి,మే5, ప్రజాజ్యోతి :** మర్కోడు గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుల ఎంపిక పై అనవసరమైన రాద్ధాంతం చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ వారు మాట్లాడుతూ మేము ఎంపిక చేసిన వారిలో అందరూ నిరుపేదలే ఉన్నారు. మర్కోడు గ్రామపంచాయతీకి వచ్చిన ఇల్లు మొత్తం 46 మర్కోడు గ్రామపంచాయతీలో ఇంకా ఇల్లు లేని పేదవారు ఉన్నారు. వారందరికీ కూడా విడతల వారి గా ఇల్లు ఇచ్చే బాధ్యత మన స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు. కాంగ్రెస్ పార్టీ తీసుకుంది. గత ప్రభుత్వాలు పది 10 సంవత్సరాల పాలనలో ఒక్క నిరుపేదకి కూడా ఇల్లు ఇవ్వలేదు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంలో పేదవారికి ఇల్లు ఇస్తుంటే ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు జనాలను అయోమయానికి గురిచేస్తున్నారు. ప్రతిపక్షాలు చెప్పే తప్పుడు మాటలు విని ప్రజలు ఎవరు మోసపోవద్దు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయి .ఇకనైనా ప్రతిపక్ష పార్టీలు తమ ఉనికి కోసం కాకుండా ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమం లో కేక్కర్ల సునీత, సుతారి రమాదేవి, ముప్పారపు రాము, కీసరి సంతోష్ పూణేం నన్ను నరేందర్, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

